క్లుప్తంగా

దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

• మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



గజపతినగరం: నియోజకవర్గం ప్రజలకు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఈ దసరా పండగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఆ దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులకు పార్టీ ఎల్లవేలలా అండగా ఉంటుందన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుడ్‌బుక్ రూపొందించేందుకు సన్నద్ధమయ్యారని, అందులో పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి, మంచి పనులు చేసేవారికి చోటుకల్పించి, వారికి తగిన గుర్తింపు, పదోన్నతలు ఇచ్చేందుకు అధిష్టానం సిద్ధంగా ఉందన్నారు. ఆయనతో పాటు పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మదుపాడ గ్రామ సర్పంచ్ కడుపుట్ల పైడిపు నాయుడు, కె.సుబ్రహ్మణ్యం, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో దుర్గా పూజ



దుర్గమ్మకు పూజ చేస్తున్న తహసీల్దార్, రెవెన్యూ ఉద్యోగులు

బొండపల్లి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మహర్నవమి సందర్భంగా శుక్రవారం దుర్గాపూజ నిర్వహించారు. తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, కార్యాలయం సిబ్బంది అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సీనియర్ సహాయకులు సత్యనారాయణ, సర్వేయర్ శివ, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం



అవగాహన కల్పిస్తున్న హెచ్‌సీ అంజిబాబు

మెరకముడిదాం: మాదకద్రవ్యాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్ అంధకారమవుతుందని బుధరాయవలస పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ అంజిబాబు అన్నారు. మెరకముడిదాంలో శుక్రవారం 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లలను సన్మార్గంలో నడిపించేందుకు కృషిచేయాలన్నారు. మాదకద్రవ్యాలపై చేసే పోరాటంలో ప్రజలు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మహాకామేశ్వరి ఆలయంలో మంత్రి పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు: మండలంలోని చౌదంతివలస గ్రామంలో ఉన్న బ్రహ్మణుల ఇలవేల్పు అయిన ఉయ్యాల మహాకామేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సూర్యనారాయణ శాస్త్రి అమ్మవారి తీర్థప్రసాదాలను ఆయనకు అందజేశారు. క్రీస్తుశకం 1500 సంవత్సరం నుంచి చౌదంతివలస గ్రామంలో ఆకుండి వంశీయులచే అమ్మవారు పూజలందుకుంటున్నారు. ఈ అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. అమ్మవారి దర్శనానికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని ఆలయ ధర్మకర్త నిష్టల ఉదయ్‌కుమార్ మంత్రికి వివరించారు. పూజా కార్యక్రమంలో మంత్రితో పాటు ఆయన తండ్రి కొండపల్లి కొండలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, గ్రామస్తులు సీతారాం, సత్యనారాయణ పాల్గొన్నారు.

పామాయిల్ సాగుకు ప్రోత్సాహం

- ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ప్రయోజనాలు
- శతశాతం రాయితీపై మొక్కలు అందజేత
- సాగు ఖర్చులతో పాటు అంతరపంటల సాగుకూ ప్రోత్సాహం



రైతులు సాగుచేస్తున్న పామాయిల్ పంట



నర్సరీల్లో పెంచుతున్న పామాయిల్ మొక్కలు

బొండపల్లి: ఆయిల్ పామ్ (పామాయిల్) సాగు చేసే రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఆయిల్‌పామ్ విస్తరణ పథకంలో భాగంగా శతశాతం రాయితీపై మొక్కలు అందించడంతో పాటు సాగుకు అవసరమైన పెట్టుబడులను కూడా అందిస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో నూనె ధరలు పెరగడంతో పామాయిల్ సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఉద్యానశాఖ అధికారులు అంటున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని రైతులు పామాయిల్ సాగుకు ముందుకురావాలని కోరుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 15 వేల హెక్టార్లలో పామాయిల్ సాగు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

నాలుగేళ్ల పాటు ప్రోత్సాహకాలు

ఆయిల్ పామ్ విస్తరణ పథకంలో భాగంగా స్వదేశీ రకం విత్తనం అయితే గరిష్టంగా హెక్టారుకు రూ.20 వేలు, విదేశీ రకం మొక్కలు అయితే రూ.29 వేల వరకు ప్రభుత్వం రాయితీ అందిస్తుంది. అదేవిధంగా మొక్కలకు నీరు పోయడం, ఎరువులు వేయడం, కూలీల ఖర్చు, ఇతర ఖర్చులకు సంబంధించి హెక్టారుకు ఏడాదికి రూ.5250లు చొప్పన నాలుగేళ్ల పాటు పెట్టుబడి సాయాన్ని అందింస్తుంది. అలాగే పామాయిల్ తోటలో అంతరపంటల సాగుకు కూడా ప్రభుత్వం హెక్టారుకు ఏడాదికి మరో రూ.5250 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తుంది. అంతరపంటలు సాగు చేసుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు. ఇక పంట చేతికి అందివచ్చిన తర్వాత గెలలను కోసేందుకు అవసరమైన పరికరాల(కత్తులు)పై రూ.2500 వరకు రాయితీ అందిస్తుంది. ప్రసుత్తం దేశీయ మార్కెట్‌లో టన్ను ఆయిల్‌పామ్ గెలలు ధర రూ.13,740 వరకు పలుకుతోంది. పామాయిల్ మొక్కల సాగుకు ఎడారి ఇసుక నేలలు తప్ప అన్ని రకాల నేలలు అనుకూలమే.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యానవనశాఖ ద్వారా పామాయిల్ సాగుకు అందిస్తున్న ప్రోత్సహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మొక్కలను సాగు చేసుకోవాలనుకోనే రైతులు పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్ కార్డుతో ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. రాయితీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. – ఎ.రాజశేఖర్, ఉద్యానవనశాఖ అధికారి, గజపతినగరం సబ్‌డివిజన్

మార్కెట్‌కు దసరా కళ



కొత్తవలస: అండర్ బ్రిడ్జి వద్ద నల్లజీడి పిక్కలు, పూజా సామగ్రి విక్రయిస్తున్న గిరిజనులు



కొత్తవలస: కొత్తవలస జంక్షన్‌లో విక్రయిస్తున్న డెకరేషన్ దండలు



గజపతినగరం: పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు



గజపతినగరం: నాటుకోళ్ల విక్రయిస్తున్న చిరువ్యాపారులు

విజయదశమి(దసరా) సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలుతో శుక్రవారం మార్కెట్లు కళకళలాడుతూ కనిపించాయి. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు మార్కెట్లకు తరలిరావడంతో సందడిగా మారాయి. పండ్లు, పూలు, పూజా సామగ్రి విక్రయించే దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ కనిపించాయి.

– గజపతినగరం/కొత్తవలస

అంగన్‌వాడీకి దారేది!



అంగన్‌వాడీ కేంద్రంలో అడ్డగా ఉన్న స్టేజి దిమ్మ

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంకు అడ్డంగా స్టేజీ దిమ్మ ఉండడంతో కేంద్రంలో చదివే చిన్నారులతో పాటు కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో కేంద్రంకు ఇరువైపులా నీరు చేరుతోంది. ఆ సమయంలో కేంద్రంలోకి వెళ్లడానికి వారంతా అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఐసీడీఎస్ అధికారులు స్పందించి కేంద్రానికి అడ్డంగా ఉన్న స్టేజి దమ్మను తొలగించడంతో పాటు కేంద్రం చుట్టూ నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మహిషాసురమర్దినిగా అమ్మవారు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ శుక్రవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మండపాల్లో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

– చీపురుపల్లి/ఎస్.కోట/గజపతినగరం



చీపురుపల్లి: మహిషాసురమర్దినిగా కనకమహాలక్ష్మి అమ్మవారు



చీపురుపల్లి: కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



వేపాడ: వల్లంపూడిలో షిర్డీసాయి మందిరంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



జామి: బస్టాండ్ వద్ద దేవీ మండపంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



బొండపల్లి: అంబటివలసలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



దత్తిరాజేరు: పెదకాదలో దుర్గమ్మ పూజలో పాల్గొన్న భక్తులు



కొత్తవలస: అమ్మవారిని దర్శించుకునేందకు క్యూలో వేచిఉన్న భక్తులు



లక్కవరపుకోట: దుర్గాదేవి మండపంలో సామూహిక పూజలు చేస్తున్న మహిళలు



మెరకముడిదాం: గోపన్నవలసలో దుర్గాదేవికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



శృంగవరపుకోట: ఎస్.కోట దుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వాహన తనిఖీలు

వేపాడ: మండలంలోని బొద్దాం జంక్షన్ వద్ద వల్లంపూడి ఎస్సై బి.దేవి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్, లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్నవారిని గుర్తించి అపరాధ రుసుం విధించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వాహన తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



కె.ఆర్.పేటలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది



బల్లంకి అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం

వేపాడ: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాలికల విద్య, సంరక్షణ చట్టాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పౌష్టికాహారం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నీలకంఠరాజపురంలో బల్లంకి సెక్టారు 1,2,3, నల్లబిల్లి 1,2, చలుమూరివానిపాలెం, నీలకంఠరాజపురం 1,2, జమ్మాదేవీపేట, పెదగుడిపాల, భర్తవానిపాలెం, చినగుడిపాల, భోజంకివానిపాలెం తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికల దినోత్సవానన్ని నిర్వహించారు.

మాజీ సర్పంచ్ చొరవతో..



గ్రావెల్‌తో గోతులు పూడుస్తున్న బంగారునాయుడు

మెరకముడిదాం: గర్భాం నుంచి సోమలింగాపురం వెళ్లే ప్రధాన రహదారి మొత్తం గోతులమయం కావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల అవస్థలను గుర్తించి బుధరాయవలస మాజీ సర్పంచ్ బాలిబంగారునాయుడు శుక్రవారం తన సొంత నిధులతో గ్రావెల్ తెప్పించి రహదారి గోతులను దగ్గరుండి పూడ్పించారు. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన బంగారునాయుడును పలువురు వాహనచోదకులు అభినందించారు.

ఆర్‌ఓబీ పనులు పరిశీలించిన ఎంపీ



పెదమానాపురం రైల్వే గేట్‌మేన్‌తో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

దత్తిరాజేరు: మండంలోని పెదమానాపురం వద్ద జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఆర్‌ఓబీ పనులను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా పరిశీలించారు. ఆ సమయంలో రైలు రావడంతో రైల్వే గేటును పది నుంచి 15 నిమిషాల పాటు మూసివేశారు. దీంతో రైల్వే గేటుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌లో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఎంపీ రైల్వే అధికారులతో ఫోన్లో మాట్లాడి ఆర్‌ఓబీ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. వంతెన పనులు నత్తనడకగా సాగడంతో నిత్యం ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అవుతోందని, దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ప్రయాణికులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ.. డిసెంబరు నాటికల్లా పనులు పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైల్వే గేటు రోజుకు ఎన్ని సార్లు వేస్తారు, ఎంత సమయంలో తెరుస్తారు, తదితర వివరాలను అక్కడున్న రైల్వే గేట్‌మేన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ఒక సిబ్బందిని నియమించాలని ఎంపీ రైల్వే అధికారులను కోరారు.